సాక్షి రాజన్న సిరిసిల్ల

గురువారం । 15 । జూన్ । 2023



తల'రాత' మార్చుతోంది

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని నిజామాబాద్‌లోని ప్రాథమిక పాఠశాలలో నెల రోజులుగా నిర్వహిస్తున్న కాలీగ్రఫీ శిక్షణ బుధవారం ముగిసింది.



స్కూల్ బస్సులు సీజ్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఫిట్‌నెస్ లేని రెండు స్కూల్ బస్సులను తంగళ్లపల్లి మండలంలో బుధవారం ఆర్టీఏ అధికారులు సీజ్‌చేశారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 41.0/30.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. వాతావరణం వేడిగా ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. వర్షం పడే అవకాశం లేదు.

న్యూస్‌రీల్

విద్యార్థుల నమోదు శాతం పెంచాలి



అక్షరాభ్యాసం చేస్తున్న డీఈవో

సిరిసిల్లఅర్బన్: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదుశాతం పెంచి జిల్లాను మొదటి స్థానంలో నిలపాలని డీఈవో రమేశ్‌కుమార్ పేర్కొన్నారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధి రాజీవ్‌నగర్‌లోని ఎంపీహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాలలో బడిబాటలో భాగంగా సరస్వతీ పూజ, అక్షరాభ్యాసం నిర్వహించారు. డీఈవో హాజరై 20 మంది చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఎంఈవో దూస రఘుపతి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గాజెంగి విష్ణు, టీఆర్‌టీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బుర్ర విష్ణు, ప్రసాద్‌గౌడ్, ఎస్‌ఎంసీ చైర్మన్ లతా నాగభూషణం, ఉపాధ్యాయులు పోతుగంటి రమేశ్, పద్మారెడ్డి, వెంకటేశ్వర్లు, శైలజ, శ్రీలత, భ్రమరాంబిక, వైష్ణవి, దేవి, సుప్రియ పాల్గొన్నారు.

రంగస్థల నాటక రంగాన్ని ఆదరించాలి



మాట్లాడుతున్న బొడ్డు రాములు

బోయినపల్లి(చొప్పదండి): అంతరించిపోతున్న రంగస్థల నాటక రంగాన్ని ప్రజలు ఆదరించాలని రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బొడ్డు రాములు కోరారు. బోయినపల్లిలో బుధవారం స్థానిక కళాకారుల సంఘ నాయకులతో కలసి విలేకరులతో మాట్లాడారు. ప్రాచీన కళలైన రంగస్థలం నాటకాలను జిల్లాలో పలు చోట్ల కళాకారులు ప్రదర్శిస్తున్నారన్నారు. బోయినపల్లిలో ఈనెల 16, 17, 18 తేదీలలో ప్రదర్శించే చిరుతల రామాయణం నాటకాన్ని ఆదరించాలని కోరారు. కళాకారులు మొగులోజి లక్ష్మీరాజం, ఆడెపు ద్వితీయచంద్, నల్లగొండ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

నిరుపేదలకు వరం సీఎం సహాయనిధి



చెక్కులు పంపిణీ చేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ప్రభుత్వం అమలు చేస్తున్న సీఎం సహాయనిధి నిరుపేదలకు వరంగా మారిందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేటలో లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. ఆగయ్య మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా సీఎం సహాయనిధి చెక్కులు అందిస్తున్నట్లు తెలిపారు. ఎంపీపీ పిల్లి రేణుక, సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు బండారి బాల్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ కృష్ణారెడ్డి, నాయకులు మల్లారెడ్డి, సందీప్, నర్సింలు, అంజలి, దేవేందర్ పాల్గొన్నారు.

చార్వాక ట్రస్టు సేవలకు గుర్తింపు



అశోక్‌కు సర్టిఫికెట్ అందిస్తున్న ప్రతినిధులు

చందుర్తి(వేములవాడ): చార్వాక ఫౌండేషన్ పేరిట వృద్ధుల సంఘాలను ఏర్పాటు చేసిన చార్వాక వ్యవస్థాపకుడు దప్పుల అశోక్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ముంబయిలో నిర్వహించిన ఆలిండియా సీనియర్ సిటిజన్ జాతీయ స్థాయిలో జరిగిన సెంట్రల్ కౌన్సిల్ సమావేశానికి చార్వక ఫౌండేషన్ చేసిన సేవలను గుర్తించారు. సంఘం వ్యవస్థాపకుడు దప్పుల అశోక్, రాష్ట్ర బాధ్యులు వుచ్చిడి రాజిరెడ్డిలను ఆహ్వానించారు. రాజన్నసిరిసిల్ల, జగిత్యాల జిల్లాలోని 90 గ్రామాల వృద్ధులను ఐక్యం చేసిన సంఘాలను ఏర్పాటు చేయడంతోపాటు వారి ఆత్మ గౌరవాన్ని పెంపొందించారని జాతీయ అధ్యక్షుడు ప్రొఫెసర్ వీకే బదాని కొనియాడారు. సర్టిఫికెట్ అందజేయడంతోపాటు సన్మానించారు.

కొత్త ఆలోచనలతో ముందుకెళ్లాలి

- తిరుపూర్ స్థాయిలో వస్త్ర పరిశ్రమ ఎదగాలి
- ఆస్పత్రుల్లో సూపర్‌స్పెషాలిటీ వైద్యసేవలు
- పేదలకు మెరుగైన సేవలందించాలి
- జిల్లా అంతటా సీసీ కెమెరాలతో నిఘా
- మంత్రి కె.తారక రామారావు



మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్, వేదికపై రవీందర్‌రావు, ప్రవీణ్, న్యాలకొండ అరుణ, జిందం కళ



చేనేత వస్త్రవ్యాపార సంఘం కార్యవర్గ సభ్యులతో మంత్రి కేటీఆర్

సిరిసిల్ల: సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సొంతంగా అభివృద్ధి చెందాలని, కొత్త ఆలోచనలతో ప్రపంచస్థాయిలో పోటీపడుతూ నిలదొక్కుకోవాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్‌శాఖ మంత్రి కె.తారక రామారావు పేర్కొన్నారు. సిరిసిల్లలో బుధవారం వస్త్రవ్యాపార సంఘం భవనంలో నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారానికి మంత్రి హాజరై మాట్లాడారు. తొమ్మిదేళ్లలో ఏం సాధించుకున్నామో ఆలోచించాలన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాను ఏర్పాటు చేసుకుని నర్సింగ్, పాలిటెక్నిక్, వ్యవసాయ, జేఎన్‌టీయూ, మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేసుకున్నామని గుర్తుచేశారు. కొత్త బైపాస్‌రోడ్లు, అపెరల్ పార్క్, వర్కర్ టు ఓనర్ పథకం, సిరిసిల్ల వస్త్రోత్పత్తిదారులకు రూ.2,500 కోట్ల బతుకమ్మ చీరల ఆర్డర్లు, ఇతర ప్రభుత్వ ఆర్డర్లు ఇచ్చామన్నారు. కాటన్ పరిశ్రమకు ఏమైనా చేయాలంటే.. ఆ రంగంలోని వ్యక్తులు ఇతర రాష్ట్రాల్లో పర్యటించి మంచి ప్రాజెక్టును ప్రతిపాదిస్తే.. సీఎం కేసీఆర్ సిద్ధంగా ఉన్నారని తెలిపారు. తిరువూర్ స్థాయిలో పరిశ్రమ ఎదగాలన్నారు.

ఆస్పత్రుల్లో సూపర్ స్పెషాలిటీ వైద్యం

జిల్లాలో వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని, మెడికల్ కాలేజీ ఏర్పాటుతో సూపర్‌స్పెషాలిటీ వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పద్మనాయక కల్యాణ మండపంలో వైద్య ఆరోగ్యశాఖ నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ ప్రపంచం మొత్తం వణికిపోయినా కరోనా సమయంలో వైద్య సేవలు అందించిన సిబ్బందికి సెల్యూట్ అన్నారు. మున్సిపల్, గ్రామపంచాయతీ పారిశుద్ధ్య సిబ్బంది సైతం బాగా పనిచేశారని కేటీఆర్ ప్రశంసించారు. మెడికల్ కాలేజీతోపాటు జిల్లా ఆస్పత్రిలో సీటీ స్కాన్, ఐసీయూ వంటి ఆధునిక వసతులు కల్పించామన్నారు. తిప్పాపూర్‌లో వంద పడకల ఆస్పత్రిలో నాణ్యమైన వైద్యసేవలు అందుతున్నాయని కేటీఆర్ కితాబునిచ్చారు. బస్తీ దవాఖానాలు, ల్యాబ్‌లు ఏర్పాటు చేశామని వివరించారు. అమ్మాయి పుడితే రూ.13వేలు, అబ్బాయి పుడితే రూ.12 వేలు ఇస్తున్నామన్నారు. మానసిక సమస్యలతో బాధపడే వారి కోసం టోల్ ఫ్రీ నంబరు 18004253333ని ఏర్పాటు చేశామని వెల్లడించారు. సీపీఆర్ శిక్షణ, ఆరోగ్య మహిళ, డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఉత్తమ వైద్యులు, సిబ్బందికి జ్ఞాపికలు అందించారు. కలెక్టర్ అనురాగ్ జయంతి, జెడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డి, జిల్లా వైద్యాధికారి సుమన్‌మోహన్‌రావు, జిల్లా ఆస్పత్రి పర్యవేక్షకులు మురళీధర్‌రావు, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, ఎంపీపీలు శరత్‌రావు, రేణుక, మానస, వైద్యసిబ్బంది, నర్సింగ్ కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయ పునర్‌నిర్మాణానికి శంకుస్థాపన

సిరిసిల్ల శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ పునర్‌నిర్మాణానికి మంత్రి కేటీఆర్, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డిలు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్, సుబ్బారెడ్డిలను సన్మానించారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బి.వినోద్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, జిల్లా రైతుబంధు సమితి చైర్మన్ గడ్డం నర్సయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, బీఆర్‌ఎస్ నాయకులు చీటి నర్సింగరావు, అక్కరాజు శ్రీనివాస్, బొల్లి రామ్మోహన్, మున్సిపల్ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, కమిషనర్ సమ్మయ్య, మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుల ఆశ్రమం ప్రారంభం



వృద్ధులకు పండ్లు అందిస్తున్న మంత్రి కేటీఆర్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని మండెపల్లిలో ఏర్పాటు చేసిన వృద్ధుల ఆశ్రమాన్ని మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వృద్ధులతో కాసేపు ముచ్చటించారు. ఇక్కడ సౌకర్యాలు ఎలా ఉన్నాయని ఆరా తీయగా.. బాగున్నాయని మరిన్ని ఏర్పాటు చేయాలని కోరారు. వెంటనే మంత్రి కేటీఆర్ కలెక్టర్ అనురాగ్ జయంతిని ముస్తాబాద్ మండలంలోనూ వృద్ధాశ్రమాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సర్పంచ్ గనప శివజ్యోతి, ఎంపీటీసీ బుస్స స్వప్న, ఎంపీపీ పడిగెల మానస, రాష్ట్ర చైల్డ్ అండ్ ఉమెన్ వెల్ఫేర్ డైరెక్టర్ శైలజ, ఎంపీడీవో పి.లచ్చాలు, సింగిల్‌విండో చైర్మన్ దేవదాస్, రాంలింగారెడ్డి ఉన్నారు.

సమస్యలు పరిష్కరించండి

మోడల్‌స్కూళ్లలో పనిచేస్తున్న హెచ్‌బీటీ(హవర్లీ బేస్డ్ టీచర్)ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండెపల్లిలో మంత్రికి హెచ్‌బీటీలు సంగీత, దుర్గేశ్వరి వినతిపత్రం అందించారు.

తెలుగు రాష్ట్రాల్లో ఆలయాల పునరుద్ధరణ



ఎల్లారెడ్డిపేటలో ఆలయ నిర్మాణ పూజలు చేస్తున్న వైవీ సుబ్బారెడ్డి, మంత్రి కేటీఆర్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ప్రాంతీయ భేదాలు లేకుండా రానున్న రోజుల్లో అన్ని పురాతన ఆలయాలను పునరుద్ధరిస్తామని టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేటలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయ పునర్‌నిర్మాణానికి టీటీడీ నుంచి రూ.2కోట్లు కేటాయించగా.. బుధవారం వైవీ సుబ్బారెడ్డి, మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

మల్కపేట రిజర్వాయర్‌తో జలకళ: కేటీఆర్

మల్కపేట రిజార్వాయర్ నుంచి ఎగువమానేరు నింపి కాలువల ద్వారా గంభీరావుపేట, ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట, కోనరావుపేట మండలాల్లోని ఆయకట్టు భూములకు సాగునీరు అందిస్తామని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. ఈ ప్రాంతాన్ని జలకళతో నింపి రెండు పసల్లు రైతులు పంటలు సాగు చేసుకునేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లో రూ.20 లక్షలతో బ్రాహ్మణసదనం నిర్మించామన్నారు. ఎల్లారెడ్డిపేటలో ప్రభుత్వ పాఠశాలను రూ.8కోట్లతో కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దామని, 15 రోజుల్లో ప్రారంభిస్తామని తెలిపారు. గంభీరావుపేట, ముస్తాబాద్, వీర్నపల్లి, తంగళ్లపల్లి పాఠశాలలను మోడర్న్ పాఠశాలలుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. స్థానికంగా ఏర్పాటు చేసిన డయాగ్నోస్టిక్ సెంటర్‌ను మంత్రి ప్రారంభించారు. టీఆర్‌ఎస్వీ నాయకుడు కొర్రి అనిల్ వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి, జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, ఎంపీపీలు పిల్లి రేణుక, మాలోతు భూల, సింగిల్ విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, ఎంపీటీసీలు నాగరాణి, అనసూయ, ఆర్డీవో శ్రీనివాస్‌రావు, తహసీల్దార్ జయంత్‌కుమార్, ఎంపీడీవో చిరంజీవి పాల్గొన్నారు.

రహదారులపై నిరంతర నిఘా

తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల నుంచి బోయినపల్లి మండలం వెంకట్రావుపల్లె వరకు సిరిసిల్ల, వేములవాడ మీదుగా వెళ్లే ప్రధాన రహదారి వెంట 80 సీసీ కెమెరాలను పోలీసులు ఏర్పాటు చేశారు. ఈ సీసీ కెమెరాలను మంత్రి కేటీఆర్ ఎస్పీ ఆఫీస్‌లో ప్రారంభించారు. తెలంగాణ ఫైబర్ గ్రిడ్ కార్పొరేషన్ ద్వారా కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేశారు. జిల్లాలోని మిగతా కామారెడ్డి, జగిత్యాల, కోరుట్ల మార్గాల్లోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని మంత్రి కేటీఆర్ ఎస్పీ అఖిల్ మహాజన్‌కు సూచించారు. జ్వాలా పోస్టర్లను ఆవిష్కరించారు.

గుడిచెరువు కలుషితం



ఇది వేములవాడలోని నివాసాల నుంచి వస్తున్న మురికినీరు నేరుగా రాజన్న గుడిచెరువులో చేరుతుంది. చెరువులోని స్వచ్ఛమైన నీటిని కలుషితం చేస్తుంది. ఇదంతా అధికారుల కళ్లముందే జరుగుతున్నా పట్టించుకోవడం లేదు. యూజీడీ ప్రతిపాదనలకే పరిమితమైంది.



స్వచ్ఛమైన నీటితో ప్రవహించాల్సిన మూలవాగు ఇలా మురికికూపంగా మారింది. మూలవాగులోకి మురికినీరు చేరుకోవడంతో నీరంతా నేరుగా మిడ్ మానేరు జలాశయంలో కలుస్తుంది. వాటర్‌హబ్‌గా ఉన్న మిడ్‌మానేరు మురికినీటితో కలుషితమవుతుంది. మూలవాగులో మురికినీరు చేరడంతో చేపలు బతకడం లేదు.



ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు, చెత్తతో పాకురుపట్టిన నీటితో మురికిగా కనిపిస్తున్న మూలవాగు

- మూలవాగులోనూ కలుస్తున్న మురుగు నీరు
- అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ లేక అవస్థలు
- నివాసాల మధ్య నిలుస్తున్న మురికి
- పట్టించుకోని పాలకులు

వేములవాడ ప్రొఫైల్

జనాభా	: 45 వేలకు పైగా..
గృహాలు	: 10 వేలకు పైగా..
ఓపెన్ డ్రెయినేజీ	: 65 కిలో మీటర్లు
మట్టి డ్రెయిన్	: 40 కిలోమీటర్లు
అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ ప్రతిపాదనలు	: రూ.33 కోట్లు

వేములవాడ: దక్షిణకాశీగా పేరుగాంచిన ఆధ్యాత్మిక పట్టణం వేములవాడలో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ(యూజీడీ) లేక పరిసరాలు కంపుకొడుతున్నాయి. సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేక గుడి చెరువు, మూలవాగులు కలుషితమవుతున్నాయి. పట్టణంలోని కాలనీల్లో నివాసాల మధ్య మురికికూపాలు పేరుకుపోతున్నాయి. ఫలితంగా దోమలు పెరగడంతోపాటు కాలనీలు కంపుకొడుతున్నాయి.

మూలవాగు కలుషితం

వేములవాడ పట్టణంలోని నివాసాల నుంచి వెలువడే మురికినీరంతా సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేక ఓవైపు రాజన్న గుడిచెరువు, మరోవైపు స్వచ్ఛమైన మూలవాగులో కలుస్తోంది. ఏళ్లుగా ఈ సమస్యకు పరిష్కారం చూపడం లేదు. గతంలో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీని నిర్మిస్తామని పాలకులు, అధికారులు ఊదరగొట్టారు. అయినా ఎక్కడిగొంగళి అక్కడే అన్నట్లు తయారైంది. కోరుట్ల బస్టాండు ప్రాంతం నుంచి చెక్కపల్లిరోడ్డు, భగవంతరావునగర్, శివసాయినగర్, పోలీస్‌స్టేషన్ ఏరియా మురికినీరంతా గుడిచెరువులోకి వెళ్తోంది. సాయినగర్, విద్యానగర్, సుభాష్‌నగర్, మార్కెట్ ఏరియా, బద్దిపోచమ్మవీధి, జాతరాగ్రౌండ్, గాంధీనగర్, ఉప్పుగడ్డ, ముదిరాజ్‌వీధి, అంబేద్కర్‌నగర్, మహాలక్ష్మీవీధి ప్రాంతాల మురికినీరు మూలవాగులో కలుస్తోంది.

ఏళ్లుగా ఇలాగే ఉంది



వేములవాడలో డ్రెయినేజీ సిస్టం ఏళ్లుగా ఇలాగే ఉంది. పాలకులు మారుతున్నారు కానీ పనులు జరుగడం లేదు. దుర్వాసన వస్తోంది. గతంలో ఎమ్మెల్యే గారితో జరిగిన సమావేశంలోనూ ఈ అంశం చెప్పాను. ఇప్పటికీ పనులు చేపట్టడం లేదు.

– బింగి శ్రీనివాస్, భగవంతరావునగర్, వేములవాడ

పవిత్రతను కాపాడడం లేదు



రాజన్న గుడిచెరువు పవిత్రతను కాపాడడం లేదు. మురికినీటితో నింపేస్తుండడంతో చెరువు నీరు కలుషితమవుతుంది. ఇప్పటికైనా పాలకులు కళ్లు తెరిచి గుడిచెరువును పవిత్రంగా ఉంచేలా చూడాలి. మూలవాగును శుభ్రం చేస్తే దుర్వాసన రాదు.

– సగ్గు పద్మ, ఉప్పుగడ్డ వీధి, వేములవాడ

మంజూరుకాగానే చేస్తాం



రూ.33 కోట్లతో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ పనుల ప్రతిపాదనలు ప్రభుత్వానికి సమర్పించాం. నిధులు మంజూరుకాగానే అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ పనులు ప్రారంభిస్తాం. గుడి చెరువు, మూలవాగులోకి మురికినీరు వెళ్లకుండా చర్యలు తీసుకుంటాం. గంజివాగు వద్ద ఏర్పాటు చేసే ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లోకి మురికినీరంతా వెళ్లేలా చూస్తాం.

– అన్వేశ్, మున్సిపల్ కమిషనర్, వేములవాడ

సేవ చేసేందుకే సంగీత నిలయం

- ఎమ్మెల్యే రమేశ్‌బాబు
- త్వరలోనే రూ.100 కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభించుకుందాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు

వేములవాడ: ప్రజలకు సేవల చేసేందుకే వేములవాడలో సంగీత నిలయాన్ని కట్టుకున్నానని ఎమ్మెల్యే రమేశ్‌బాబు పేర్కొన్నారు. స్థానిక సంగీత నిలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. 60 ఏళ్ల తన తండ్రి రాజకీయ వారసత్వం నుంచి ఎన్నో అంశాలు నేర్చుకునే రాజకీయాల్లోకి వచ్చానని స్పష్టం చేశారు. వేములవాడ తనకు తల్లిలాంటిదని, తుదిశ్వాస వరకు అభివృద్ధి కోసమే పనిచేస్తానని స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల్లో సిట్టింగ్‌లకే సీట్లు అని సీఎం కేసీఆర్ ప్రకటించారని, సీట్లు రాని ఎమ్మెల్యేలను స్వయంగా పిలిపించుకుని మాట్లాడారని, తనను మాత్రం పిలవలేదన్నారు. పార్టీ ఆదేశాల మేరకే నియోజకవర్గంలో ఏడు ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రైవేట్ ఆస్పత్రుల ద్వారా వందల కోట్లు సంపాదించిన వారు ఏదేదో పేరుతో వస్తున్నారనీ, పేదవాడికి మెరుగైన వైద్యం అందించేందుకే వేములవాడలో వంద పడకల ఆస్పత్రిని ప్రారంభించామని స్పష్టం చేశారు. గుడి చెరువులోకి 365 రోజులు గోదావరి జలాలతో నింపుతామనీ, మూలవాగును మల్కపేట రిజర్వాయర్‌తో జీవనదిలా మార్చుతామన్నారు. భారత రాష్ట్ర సమితి మరోసారి అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. త్వరలోనే మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా రూ.100 కోట్ల పనులను ప్రారంభించుకుందామన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, ఎంపీపీ చంద్రయ్య గౌడ్, పార్టీ అధ్యక్షుడు పుల్కం రాజు, గోస్కుల రవి, కౌన్సిలర్లు మారం కుమార్, జోగిని శంకర్, సిరిగిరి చందర్, యాచమనేని శ్రీనివాస్‌రావు, నరాల శేఖర్, ఇప్పపూల అజయ్, కో–ఆప్షన్ సభ్యుడు కట్కూరి శ్రీనివాస్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు ఏశ తిరుపతి పాల్గొన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

వేములవాడఅర్బన్: తిప్పాపూర్‌లోని తెలంగాణచౌక్ వద్ద ఎమ్మెల్యే రమేశ్‌బాబు ఆధ్వర్యంలో వికలాంగులు సీఎం కేసీఆర్ చిత్రాపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలోనే సంక్షేమంలో తెలంగాణ రాష్ట్రాన్ని పుట్టినిల్లుగా చేసిన సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. వికలాంగుల ఇబ్బందులు తెలుసుకుని రూ.3016 ఉన్న పింఛన్‌ను మరో రూ.4,016 చేశారన్నారు. కౌన్సిలర్లు శ్రీనివాసరావు, అజయ్, జోగిని శంకర్, టేలర్ శ్రీనివాస్ ఉన్నారు.

రాజన్నా.. రక్షించు



వేములవాడ: రాజన్నను బుధవారం 15 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ఏకాదశి పర్వదినం కావడంతో పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. ఈనెల 18 నుంచి ఆషాఢమాసం ఆరంభం కానున్నట్లు ఆలయ అర్చకులు బుధవారం తెలిపారు. ఆషాఢమాసంతోపాటు అధిక మాసం వస్తుండటంతో 60 రోజులపాటు శుభఘడియలు ఉండవని ఆలయ అర్చకులు సురేశ్ తెలిపారు. సీనియర్ నాయకుడు వుచ్చిడి మోహన్‌రెడ్డి స్వామివారిని దర్శించుకుని, కోడెమొక్కు చెల్లించారు.

క్లుప్తంగా

నకిలీ ఎరువులను అరికట్టాలి



మాట్లాడుతున్న గుంటి వేణు

సిరిసిల్లటౌన్: జిల్లాలో వ్యవసాయ అధికారుల పర్యవేక్షణ లోపంతో నకిలీ ఎరువులు, పెస్టిసైడ్స్ మార్కెట్లోకి వచ్చాయని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. బుధవారం సిరిసిల్లలోని కార్మిక భవనంలో జరిగిన జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ అధికారుల అండతోనే నకిలీ విత్తనాలు మార్కెట్లోకి వస్తున్నాయని ఆరోపించారు. ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాయకులు జంగం అంజన్న, సోమ నాగరాజు, వంతడ్పుల పరుశ రాములు, రాజనర్సు, శంకర్, ఆనంద్, ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ సర్పంచ్ మృతి


రాజు (ఫైల్)

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రోడ్డు ప్రమాదంలో మాజీ సర్పంచ్ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రాగట్లపల్లి మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ నాయకుడు మందాటి రాజు (30) మంగళవారం రాత్రి ద్విచక్రవాహనంపై ఎల్లారెడ్డిపేట నుంచి రాగట్లపల్లికి వెళ్తుండగా సిరిసిల్ల నుంచి ఎల్లారెడ్డివైపు వెళ్తున్న కారు ఎదురుగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రాజును కుటుంబ సభ్యులు ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేట్ అస్పత్రికి, అక్కడినుంచి హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ఏరియా అస్పత్రికి తరలించారు. రాజు మృతిపై బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, ఎంపీపీ పిల్లి రేణుక, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, సర్పంచ్ సుజాత, మాజీ ఎంపీపీ ఎలుసాని మోహన్‌కుమార్ పలువురు సంతాపం తెలిపారు. మృతుడికి భార్య రమ్య, కుమారులు హరిచరణ్, సాయి, శాకేశ్ ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రేమ్‌దీప్ తెలిపారు.

బైక్ అదుపు తప్పి మరొకరు..


ఇర్ఫాన్ (ఫైల్)

దుబ్బాకరూరల్/గంభీరావుపేట(సిరిసిల్ల): బైక్ అదుపు తప్పి వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. గంభీరావుపేట మండలం లింగన్నపేటకు చెందిన ఎండీ ఇర్ఫాన్(30) దుబ్బాకలోని తన బంధువులను కలిసేందుకు వెళ్తుండగా చీకోడ్‌లోని పెట్రోల్ పంపు వద్దకు రాగానే బైక్ అదుపు తప్పింది. తీవ్రంగా గాయపడ్డ ఇర్ఫాన్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తల్లి ఏదుల్‌బీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తహసీల్దార్ ఎదుట బైండోవర్

వీర్నపల్లి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఓ మహిళను బైండోవర్ చేశారు. గుడుంబా విక్రయిస్తుందన్న అనుమానంతో లాల్‌సింగ్ తండాకు చెందిన భూక్య బీనిని తహసీల్దార్ తఫాజుల్ ఎదుట రూ. 1 లక్ష పూచీకత్తుతో బైండోవర్ చేశారు. ఇక్కడ ఎక్సైజ్ సిబ్బంది, తదితరులున్నారు.


నెలరోజుల క్రితం స్వచ్ఛ సిరిసిల్ల మానేరు తీరంలో కొందరు వ్యాపారులు దుకాణంలోని వేస్టేజ్‌ను పడేశారు. సిబ్బందితో తనిఖీ చేపట్టి కమిషనర్ వారికి తలా రూ. 2వేలు జరిమానా విధించారు. ఇటీవల బహిరంగంగా చెత్త పడేసే వారికి కూడా జరిమానా విధించారు.

పట్టణంలో ప్రతిరోజూ ఇంటింటికీ వెళ్లి ట్రాక్టర్‌లో చెత్త సేకరిస్తున్నారు. మున్సిపల్ సిబ్బంది చెత్తను మూడు రకాలుగా విభజించి వేస్టేజ్‌ను సేకరిస్తున్నారు. 39 వార్డుల్లో రోజూ 30 టన్నులకు పైగా ఇంటింటా చెత్తను సేకరించి డంప్‌యార్డుకు చేరవేస్తారు.




మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ మూడోవార్డులో ప్రతి ఆదివారం డ్రైడే కార్యక్రమం నిర్వహిస్తున్నారు. తడి, పొడి చెత్తను వేరుచేసి బల్దియా సిబ్బందికి అందించాలని అవగాహన కల్పిస్తున్నారు. చైర్ పర్సన్‌తో పాటు అన్నివార్డుల్లో కౌన్సిలర్లు డ్రైడే, పారిశుధ్య పనులు చేపడుతున్నారు.

‘చెత్త’ రహిత పట్టణంగా సిరిసిల్ల

- ప్లాస్టిక్ వస్తువులు పడేసేవారిపై చర్యలు
- నిత్యం అన్నివార్డుల్లో అధికారుల పర్యవేక్షణ
- చెత్తపడేసే వారికి భారీగా జరిమానా
- ట్రాక్టర్ల ద్వారా తడి, పొడి చెత్త సేకరణ
- ఉత్తమ మున్సిపల్‌గా అవార్డు

సిరిసిల్ల మున్సిపల్ ప్రొఫైల్

పట్టణ జనాభా	1,09.850
పట్టణంలో వార్డులు	39
శానిటేషన్ సిబ్బంది	277
ప్రతిరోజూ చెత్త ఉత్పత్తి	50మెట్రిక్ టన్నులు
సేకరిస్తున్న చెత్త	48 మెట్రిక్ టన్నులు
రోజూ ప్లాస్టిక్ పదార్థాల ఉత్పత్తి	12 టన్నులు



మంత్రుల చేతుల మీదుగా ఉత్తమ మున్సిపల్ అవార్డు అందుకుంటున్న కమిషనర్ సమ్మయ్య


హోటల్ యజమానికి జరిమానా విధిస్తున్న మున్సిపల్ సిబ్బంది

సిరిసిల్ల టౌన్ : సిరిసిల్లను చెత్త రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. చెత్తను రోడ్లపై పడేస్తున్న వారికి మున్సిపల్ అధికారులు పెనాల్టీలు విధిస్తున్నారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ పడేయకుండా ఏడేళ్లుగా సిరిసిల్ల సాధిస్తున్న స్వచ్ఛ కీర్తిని కొనసాగిస్తోంది. ఇటీవల రాష్ట్ర పొల్యూషన్ బోర్డు నిర్వహించిన పోటీల్లో సిరిసిల్ల మున్సిపల్ ఉత్తమ అవార్డు సాధించింది.

పరిశుభ్రతకు పట్టం..

- 39 వార్డుల్లో 1,09,850 జనాభా ఉంది. శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, కమిషనర్ వెల్దండి సమ్మయ్య పర్యవేక్షిస్తున్నారు.
- రోజూ పట్టణంలో 50 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. పారిశుధ్య పనుల్లో ఇంటింటా 48 మెట్రిక్ టన్నుల చెత్తను సేకరిస్తున్నారు.
- 39 వార్డుల్లో 277 మంది శానిటేషన్ కార్మికులు పనిచేస్తున్నారు. పట్టణంలో రోజు 12 టన్నుల వరకు ప్లాస్టిక్ చెత్తను బల్దియా సేకరించడం విశేషం. పండుగ రోజుల్లో 20 టన్నుల వరకు సేకరించి తడి, పొడి చెత్త నుంచి ఎరువు తయారు చేస్తున్నారు.
- వారంలో రెండుసార్లు తనిఖీ చేస్తూ నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను ఎవరూ విక్రయించచుండా చర్యలు తీసుకుంటున్నారు.
- ప్రతిరోజూ వార్డుల సందర్శనలో భాగంగా మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, కమిషనర్ వెల్దండి సమ్మయ్య పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్నారు.

చెత్త పడేసే వారిపై చర్యలు


ఏడేళ్లుగా సిరిసిల్ల పట్టణం స్వచ్ఛ కీర్తిని కొనసాగిస్తున్నాం. మంత్రి కేటీఆర్, పాలకవర్గం, ప్రజల సహకారంతోనే అవార్డులు సాధిస్తున్నాం. రోడ్లపై చెత్త, ప్లాస్టిక్ వస్తువులను పడేయవద్దు. చెత్త పడేసే వారిపై చర్యలు తీసుకుంటాం. పట్టణంలో ట్రిపుల్ ఆర్ విధానం అమలు చేస్తున్నాం.
– వెల్దండి సమ్మయ్య, మున్సిపల్ కమిషనర్

నిషేధిత వస్తువులివే.

ప్లాస్టిక్ పదార్థాలతో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుండటంతో సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (సీపీసీఈ) పదహారు రకాల ప్లాస్టిక్ వస్తువులను నిషేధించింది. గత జూలై1 నుంచి సిరిసిల్ల బల్దియా అమల్లోకి తీసుకువచ్చింది. ఇయర్‌బర్డ్స్, బుడగలు (బెలూన్స్), క్యాండీ, ఐస్‌క్రీం కోసం వాడే పుల్లలు, ప్లాస్టిక్ ప్లేట్లు, కప్పులు, గ్లాసులు, ప్లాస్టిక్ కత్తులు, ట్రేలు, ప్లాస్టిక్ స్వీట్ బాక్సులు, ఆహ్వాన పత్రికలు, సిగరెట్ ప్యాకెట్లు, 100 మైక్రాన్ల లోపు ఉండే పీవీసీ బ్యానర్లు, పాలిస్టరిన్(థర్మాకోల్) 120 మైక్రాన్ల కన్నా తక్కువ ఉండే ప్లాస్టిక్ కవర్లను విక్రయించుకుండా చూస్తున్నారు.

కేటీఆర్ పర్యటనను అడ్డుకున్న బీజేవైఎం నాయకులు


నాయకులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): మండల కేంద్రంలో మంత్రి కేటీఆర్ పర్యటనను బుధవారం బీజేవైఎం నాయకులు అడ్డుకున్నారు. మంత్రి కాన్వాయ్‌ను అడ్డుకుంటున్న క్రమంలో పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. బీజేవైఎం మండల అధ్యక్షుడు జితేందర్ రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేయడం లేదని, ధాన్యం కొనుగోలు చేసి నెలరోజులు కావస్తున్నా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయలేదన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరు చేస్తామని హామీ ఇచ్చి పట్టించుకోవడం లేదన్నార. అల్మాస్‌పూర్‌లో కబ్జాకు గురైన రంగం చెరువును కాపాడాలని డిమాండ్ చేశారు. సమస్యలపై మంత్రిని కలిసేందుకు వెళ్లిన వారిని పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేయడం సరికాదన్నారు. నాయకులు సాయి, కిరణ్, ప్రకాశ్ పాల్గొన్నారు.

16 నుంచి పాలిసెట్ సర్టిఫికెట్ల పరిశీలన

వేములవాడఅర్బన్: రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాల కోసం టీఎస్ పాలిసెట్ 2023లో ర్యాంకులు సాధించిన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ఈనెల 16 నుంచి 19 వరకు వేములవాడ మండలం అగ్రహారం ఎస్సార్ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ బి.రాజగోపాల్ తెలిపారు. ఈ నెల 14 నుంచి 18 వరకు ఆన్‌లైన్‌లో స్లాట్ బుకింగ్ చేసుకోవాలన్నారు. 16 నుంచి 19 వరకు స్లాట్ బుకింగ్ చేసుకున్న వారికి సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని తెలిపారు. 16 నుంచి 21 వరకు కళాశాలలు, కోర్సులు ఎంచుకోవడానికి ఆప్షన్స్ ఇచ్చుకోవాలని తెలిపారు. 25న సీట్ల కేటాయింపు ఉంటుందని తెలిపారు. 25 నుంచి 29 వరకు వెబ్‌సైట్ ద్వారా ట్యూషన్ ఫీజు చెల్లించడం, ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్ ఉంటుందని వివరించారు. సర్టిఫికెట్ల పరిశీలనకు ర్యాంక్‌కార్డు, ఆధార్‌కార్డు, పదోతరగతి మెమో, స్టడీ సర్టిఫికెట్ 5 నుంచి 10వ తరగతి వరకు, ఆదాయ సర్టిఫికెట్ అవసరమని తెలిపారు. కులం సర్టిఫికెట్, టీసీ ఒరిజినల్‌తోపాటు రెండు సెట్ల జిరాక్స్‌లను తీసుకురావాలని సూచించారు.

అయ్యో బిడ్డలారా..!

- మానేరులో ఈతకు వెళ్లి ఇద్దరు చిన్నారుల మృతి
- కళ్లముందే చనిపోవడంతో విలపించిన కుటుంబ సభ్యులు
- మృతులది జమ్మికుంట మండలం తనుగుల
- ఓదెల మండలం పొత్కపల్లి వద్ద ఘటన
- వేసవి సెలవులకు వీణవంక మండలం కొండపాకకు..


చెక్‌డ్యాం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు


నిత్య, సాత్విక్ (ఫైల్)

ఓదెల/వీణవంక/జమ్మికుంట: వేసవి సెలవుల కోసం బంధువుల ఇంటికి వెళ్లిన ఇద్దరు చిన్నారులు మానేరువాగులో మునిగి మృత్యువాత పడడం స్థానికంగా విషాదం నింపింది. వీణవంక మండలం కొండపాక చెక్‌డ్యాం, పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం పొత్కపల్లి చెక్‌డ్యాం సమీపంలో చోటుచేసుకున్న ఈ ఘటన మూడు గ్రామాల ప్రజలను కలచివేసింది. జమ్మికుంట మండలం తనుగులకు చెందిన జూపాక అశోక్, భాగ్యలక్ష్మికి కూతురు సింధు, సాత్విక్ (13)సంతానం. అదే గ్రామానికి చెందిన కాసర్ల సునీల్, వందనకు కూతురు నిత్య(12) కుమారుడు ధామస్ సంతానం. వేసవి సెలవుల కోసం మూడు రోజుల క్రితం కొండపాకలోని సంపత్ ఇంటికి వెళ్లారు. బుధవారం ఉదయం కొండపాక శివారులోని చెక్‌డ్యాంలో స్నానం చేద్దామని వెళ్లారు. నిత్య, సాత్విక్ ప్రమాదవశాత్తు నీటిలో మునిగారు.

చదువులో ఇద్దరూ ముందంజ..

సాత్విక్ తనుగుల ప్రభుత్వ పాఠశాలలో ఐదో తరగతి చదివి ఆరో తరగతి కోసం ఇటీవల జరిగిన సోషల్ వెల్ఫేర్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించాడు. నిత్య హుజూరాబాద్‌లోని బీసీ వెల్ఫేర్‌లో ఏడో తరగతి చదువుతోది. ఇద్దరూ చదువులో చురుగ్గా ఉండేవాళ్లని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. తహసీల్దార్ రాజయ్య, ఎస్సై శేఖర్‌రెడ్డి, బ్లూకోల్ట్స్ సిబ్బంది రాజబాబు చిన్నారుల మృతదేహాలను బయటకు తీసేందుకు కృషి చేశారు. జమ్మికుంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఎమ్మెల్యే ఈటల రాజేందర్ సంతాపం

సాత్విక్, నిత్య మృతి చెందడంపై హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలను ఆదుకుంటామని తెలిపారు. సర్వాయి పాపన్న మోకు దెబ్బ గౌడ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు జక్కే వీరస్వామిగౌడ్, సర్పంచ్ చిలుముల వసంత, ఎంపీటీసీ వాసాల నిరోష తదితరులు సంతాపం తెలిపారు.

డేంజర్‌గా జోన్‌గా మానేరు

పొత్కపల్లి వద్ద మానేరు వాగు డేంజర్‌జోన్‌గా మారింది. నెల రోజుల క్రితం ఇక్కడే ఓ చిన్నారి కూడా ఈతకోసం వెళ్లి ప్రాణాలు కోల్పోయాడు. తాజాగా ఇద్దరు చనిపోయారు. పొత్కపల్లి మానేరు చుట్టు గ్రామాలైన వీణవంక, కోర్కల్, కొండపాక, మడక, కనగర్తి, మల్లారెడ్డిపల్లె, కల్లుపల్లె ప్రజలు మానేరులో ఈత కొట్టేందుకు వస్తుంటారు. మానేరులో చెక్‌డ్యాంల నిర్మాణాల కోసం ఈ ప్రాంతంలో ఇసుక తవ్వకాలతో లోతైన గోతులు ఏర్పడ్డాయి. అవి నీటితో నిండిపోవడంతో చిన్నారులకు లోతు తెలియక మునిగిపోతున్నారు. మే 22న జీలకుంటలో జరిగిన భూలక్ష్మి ఉత్సవాలకు వచ్చిన వరంగల్ జిల్లా టేకుమట్ల మండలం వెన్నంపల్లి గ్రామానికి చెందిన పింగిళి సదాశివరెడ్డి(24) ఇక్కడే మృతిచెందాడు. నెల తిరగకముందే సాత్విక్, నిత్య మానేరులో మునిగి మృతిచెందారు. ప్రమాదాలు జరగకుండా మానేరు చుట్టూ రక్షణ ఏర్పాటు చేయాలని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు.

‘నీట్’లో అల్ఫోర్స్ విద్యార్థుల ప్రభంజనం



మార్కులు సాధించిన విద్యార్థులతో డా.నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): నీట్– 2023 ఫలితాల్లో అల్ఫోర్స్ నీట్ అకాడమీ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. జి.సంతోషిని 619 మార్కులు, డి.ఆదిత్య చంద్రకాంత్‌రెడ్డి 615, ఎస్.ధీరజ్‌కుమార్ 610, కె.ప్రణీతరెడ్డి 610, జి.జ్యోతి 600, బి.శ్రీగోధ 594, డి.అశ్వితరెడ్డి 588, సయ్యద్ అతిభవుర్ రహమాన్ 583, టి.దీపిక 571, సాయిసదిష్ట 570, కె.అలేఖ్య రెడ్డి 564, నబిహ 558, బి.విద్యాలక్ష్మీ 550, స్నేహ మాలిక్ 550, బి.ప్రణయ్ 549, రువైఫ ఫాతిమా 537, ఎస్.అనూష 537, డి.వర్షిణి 533, సీహెచ్.పార్థివ్ ఖౌండిన్య 533, ఆర్.స్నిఖిత 529, కె.హారిక 529, ఎస్.చందన 527, సీహెచ్.శ్రీవేదార్చిత 527, శ్రేషిత 523, ముస్కాన్‌తభస్సుమ్ 521, బి.శ్రీనిధి 520, ఫాయేజాఅంజుమ్ 518, ఎ.అక్షిత 516, సాయివిఘ్నేష్ 515, ఎ.మానస 514, వి.శైలేష్ 513, ఎస్.అభినయ 511, ఎ.హరిచరణ్ 506, కె.శ్రీఫణి 505, ఎ.అద్వైతవర్షిణి 503 మార్కులతో రాణించినట్లు విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి తెలిపారు. కరీంనగర్‌లోని అల్ఫోర్స్ టైనీటాట్స్‌లో విద్యార్థులను అభినందించారు. ఐదుగురు 600పై మార్కులు, 36 మంది 550పై, 55 మంది 450పై మార్కులు సాధించారని, సుమారు 80 మంది విద్యార్థులు ప్రతిష్టాత్మక మెడికల్ కళాశాలల్లో సీట్లు సాధించగలరని తెలిపారు.

శ్రీచైతన్య విద్యార్థుల హవా..



విద్యార్థులను అభినందిస్తున్న రమేశ్‌రెడ్డి, యాజమాన్యం

కరీంనగర్: నీట్ ఫలితాల్లో శ్రీచైతన్య విద్యార్థులు అద్భుత ర్యాంకులు సాధించారు. బానోతు దినేష్‌నాయక్ 425, ఆర్.హరికృష్ణ 1169, ఎస్.స్వాతి 1755తో జాతీయ ర్యాంకులు సాధించారని విద్యాసంస్థల అధినేత ఎం.రమేశ్‌రెడ్డి తెలిపారు. ఎం నందిని 609 మార్కులు, తాటి కావ్యశ్రీ 580, డి.కార్తీక్ 554,, బి.సాయివినీత్ 545, డింపుల్ జెస్టినా 541, ఎ.కీర్తన 533, సుద్దాల శ్రీనివాస్ 492, వి.అఖిల 491, మేముల శ్రీజ 466, ఎం. కృష్ణతేజ 459, ఎస్.స్వాతి 458, ఎస్.జెస్విందర్‌కౌర్ 452, పాదం యశ్వంత్ 447, కె. ఆదిత్య 445, హుస్సేన్ 438, కె.అర్జున్ 437, ఎస్.అనిల్ 437, సిహెచ్ చందన 435, కె. సాయికిరణ్ 427, వి.మధుకర్ 414, ఐ.రమణిరెడ్డి 411 మార్కులు సాధించినట్లు తెలిపారు. ఇంటర్, ఎంసెట్, ఐఐటీ, నీట్ ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు అత్యున్నత ఫలితాలతో ఉత్తర తెలంగాణలో అగ్రగామిగా నిలుస్తున్నారని వివరించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాలల డైరెక్టర్ కర్ర నరేందర్‌రెడ్డి, డీన్ జగన్‌మోహన్‌రెడ్డి, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ మల్లారెడ్డి, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్, రాధాకృష్ణ, ఏజీఎం శ్రీనివాస్, అధ్యాపకులు అభినందించారు.

బీజేపీ రాష్ట్ర కార్యవర్గంలో ముగ్గురికి చోటు


చక్రధర్‌రెడ్డిని అభినందిస్తున్న తరుణ్ ఛుగ్, బండి సంజయ్

ముస్తాబాద్(సిరిసిల్ల): బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ముస్తాబాద్‌కు చెందిన ముగ్గురు నాయకులకు అధిష్టానం అవకాశం కల్పించింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ మండలకేంద్రానికి చెందిన ముగ్గురికి ఒకేసారి రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా చోటు కల్పించడం గమనార్హం. ముస్తాబాద్ మాజీ జెడ్పీటీసీ మట్ట వెంకటేశ్వర్‌రెడ్డికి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నాలుగోసారి నియమించారు. మోహినికుంటకు చెందిన మేర్గు హన్మంత్‌గౌడ్‌కు మూడోసారి రాష్ట్ర కార్యవర్గంలో స్థానం కల్పించారు. మండలకేంద్రానికి చెందిన సింగిల్‌విండో మాజీ చైర్మన్ కనమేని చక్రధర్ రెడ్డికి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర ఇన్‌చార్జి తరుణ్‌ఛుగ్‌ను చక్రధర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలవగా తరుణ్‌చుగ్ అభినందించారు.

ముగ్గుల పోటీలు


ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మహిళలు, ఆరోగ్య సిబ్బందికి ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఆస్పత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనతరం పలువురికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ బాబు, వైద్యాధికారి ప్రవంతి, రఘు, ప్రదీప్, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

టీటీడీ చైర్మన్‌కు కాంగ్రెస్ నేతల స్వాగతం


టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డికి కరచాలనం చేస్తున్న ఆది శ్రీనివాస్

సిరిసిల్లటౌన్: టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్‌తోపాటు పార్టీ నాయకులు ఘనస్వాగతం పలికారు. సిరిసిల్లకు మంత్రి కేటీఆర్‌తో కలిసి శ్రీలక్ష్మీ వేంకటేశ్వర ఆలయం పునర్నిర్మాణ పనుల శ్రీకారానికి విచ్చేసిన ఆయనను సిరిసిల్ల బైపాస్‌రోడ్డులోని హెలీప్యాడ్ వద్ద కాంగ్రెస్ నేతలు కలిశారు. ఆది శ్రీనివాస్ శాలువా కప్పి స్వాగతించగా.. టీపీసీసీ సభ్యుడు నాగుల సత్యనారాయణగౌడ్, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, నాయకులు ఆకునూరి బాలరాజు, సూర దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

సత్తా చాటిన ట్రినిటీ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ట్రినిటీ కళాశాల యాజమాన్యం

కరీంనగర్: నీట్ ఫలితాల్లో ట్రినిటీ కళాశాలలు పెద్దపల్లి, కరీంనగర్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. టీ45 బ్యాచ్ నుంచి 20 మంది తెలంగాణ, ఇతర రాష్ట్రాల్లోని మెడికల్ కాలేజీల్లో సీట్లు సొంతం చేసుకున్నారని వివరించారు. ఫలితాల్లో ఎ.సంధ్యారాణి 628 మార్కులు, కె.ఐశ్వర్య 605 , ఎస్.కార్తీకేయ 578 , టి.అవినాశ్ కుమార్ 531, ఎ.మల్లికార్జున్ 530, ఎ.మహేందర్ 527, ఎ.భార్గవి 524 , వి. అర్పిత 523 , ఎం. రేఖ 492 , ఎ.శివవర్ష 488 , హరికృష్ణ 484, ఎండీ అబ్దుల్ ముజీబ్ 478 , బి.సిరి 468 , ఆర్. వంశీకృష్ణ 466 , ఎం. నిత్య 463, బి.దీపక్ 455, ఎన్. కార్తీక్ 453 , ఆర్.అలేఖ్య 449, కె.లిఖిత 438, సీహెచ్ వైష్ణవి 430, కె.దివ్యసాయి 427, కె.కిరణ్ 427, ఎస్. మనీషా 423 , సరీశ్ ఐమన్ 421 , జి.శరున్ 421 , సుస్మితాగ్రేస్ 420, ఆర్. శైలజ 419 , వై.అశ్లేష 418, బి.నివేదిత 417, బి.దీపక్ లాల్ 412, సాయిమోక్షిత్ రెడ్డి 402 మార్కులు సాధించారు. లాంగ్ టర్మ్ బ్యాచ్ ఈనెల 14 నుంచి ప్రారంభమైనట్లు తెలిపారు. ఫలితాలు సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను అధ్యాపక బృందాన్ని ఫౌండర్ చైర్మన్ పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, డీన్, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.